సాక్షి రంగారెడ్డి

గురువారం । 3 । జూలై । 2025



పిల్లలకు తప్పిన ముప్పు

డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. 8లో▸



మట్టి తవ్వకాలు!

పెద్దచెరువు (ఐల్యాండ్)లో నిబంధనలకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపట్టారు. 8లో▸



నిధుల దుర్వినియోగం..

షాద్‌నగర్ పోస్టాఫీస్‌లో నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు అధికారులకు ప్రత్యేక శిక్షణ

ఆమనగల్లు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో గురువారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్, స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమ మాధురి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవాలని కోరారు.

డాక్టర్ సరితకు 'వైద్య శిరోమణి'



అవార్డు అందజేస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

షాద్‌నగర్: షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ సరితను వైద్య శిరోమణి అవార్డు వరించింది. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి బుధవారం నగరంలోని రవీంద్రభారతిలో నవ కళా వేదిక ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేశారు. కోవిడ్ సమయంలో జిల్లా ఆస్పత్రితో పాటు కిమ్స్ ఆస్పత్రిలో చిన్నారులకు వైద్యం అందించిన డాక్టర్ సరితను వైద్య శిరోమణి అవార్డుకు ఎంపిక చేశారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆమెకు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సుందరం, దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు.

షాద్‌నగర్‌కు మాజీ మంత్రి



అంజద్ గోరి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మహమూద్ అలీ

షాద్‌నగర్: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న మైనార్టీ నేత అంజద్ ఘోరి నివాసానికి బుధవారం మాజీ హోంమంత్రి మహమూద్ అలీ విచ్చేశారు. ఇటీవల అంజద్‌గోరి కుమారుడి వివాహం జరిగిన నేపథ్యంలో శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ముస్లిం మైనార్టీ నాయకులు మహమూద్ అలీని ఘనంగా సన్మానించారు.

యూజీడీ నిర్మాణానికి వినతి



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భగత్‌సింగ్ కాలనీవాసులు

షాద్‌నగర్: భగత్‌సింగ్ కాలనీలో డ్రైనేజీ నిర్మించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం వారు క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రామకృష్ణ థియేటర్, కటిక కేరి, పద్మావతీ కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు భగత్‌సింగ్ కాలనీ మీదుగా వెలుతోందని.. వర్షాలు కురిస్తే డ్రైనేజీ పొంగి ఇళ్లలోకి మురుగు వస్తుందన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ కౌన్సిలర్ సరిత, యాదగిరి యాదవ్, కాలనీ వాసులు వెంకటేశ్ యాదవ్, రోమియో రమేశ్, మహేందర్, శ్రీనివాస్, నర్సింలు తదితరులు ఉన్నారు.

జాతీయ సదస్సుకు కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్

కొత్తూరు: హర్యానా రాష్ట్రం గురుగ్రామ్ పట్టణంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ డోలి రవీందర్‌కు ఆహ్వానం అందింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం, దేశనిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాలు, పట్టణాలు, స్థానిక సంస్థల చైర్మన్లు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు తమకు మున్సిపల్ పరిపాలన విభాగం నుంచి సమాచారం వచ్చిందని చెప్పారు.

తీరని దాహం

మున్సిపాలిటీల్లో తాగునీటి కటకట

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక ఇక్కట్లు
- శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న మున్సిపల్ వాసులు

వానాకాలంలోనూ జిల్లా పరిధిలోని పలు మున్సిపాలిటీల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పైప్‌లైన్‌లు పగిలిపోవడం, లీకేజీల కారణంగా రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతోంది. పలు పురపాలికల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ సరిపడా అందడం లేదని మున్సిపల్ వాసులు వాపోతున్నారు.



తుక్కుగూడలో వాల్వ్ లీకవడంతో వృథాగా పారుతున్న నీరు

పైప్‌లైన్లు, ఎయిర్‌వాల్వ్ లీకేజీలు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని తాగునీటి సమస్య వేధిస్తుంది. ఔటర్ రింగు రోడ్డు లోపల భాగం తుక్కుగూడ, రావిర్యాల, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్ కాలనీలకు హెచ్ఎండబ్ల్యూస్ ఆధ్వర్యంలో, ఔటర్ ఆవలి భాగంలో ఉన్న మంఖాల్, ఇమామ్‌గూడ గ్రామాలకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నీటి పంపిణీ జరుగుతుంది. ఈ రెండు శాఖల నీటి సరఫరా అవసరం మేరకు పంపిణీకాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పైపులైన్లు, ఎయిర్‌వాల్వ్ లీకేజీల కారణంగా నీరు వృథా అవుతుంది. దీంతో ప్రజలు వీధుల్లో ఉన్న బోర్లను ఆశ్రయిస్తున్నారు.

❖ 'భగీరథ' కష్టాలు

మొయినాబాద్: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా ఇచ్చి తాగునీటి సరఫరా చేస్తున్నా నీటి కష్టాలు మాత్రం తప్పడంలేదు. అక్కడక్కడ మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలి లీకేజీ అయ్యి నీరు వృథాగా పారుతోంది. మున్సిపల్ కేంద్రంలోని లక్ష్మీగణపతినగర్ కాలనీ, భరద్వజ్ కాలనీ, ముస్తాఫా హిల్ కాలనీలకు నీటి సరఫరా సరిగా అందడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాకపోవడంతో బోర్ల ద్వారా నీళ్లు అందిస్తున్నా అవి కూడా సరిపోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ముర్తూజగూడకు వెళ్లే భగీరథ పైప్‌లైన్ పగలడంతో గ్రామానికి నీళ్లు అందడం లేదు. బోర్లద్వారా నీటిసరఫరా చేస్తున్నారు. అజీజ్‌నగర్ హరిజనవాడలో మిషన్‌భగీరథ నీళ్లు ట్యాంకులోకి ఎక్కడంలేదు. హిమాయత్‌నగర్, మొయినాబాద్, అజీజ్‌నగర్‌లో తరచూ మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలి నీళ్లు లీకవుతున్నాయి.



హిమాయత్‌నగర్‌లో పైప్‌లైన్ లీకై రోడ్లపై పారుతున్న తాగునీరు

ట్యాంకర్లే ఆధారం

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీలో 12 గ్రామాలు విలీనమయ్యాయి. ఇక్కడ మిషన్ భగీరథ నీరే ప్రధాన వనరు. నీటి సరఫరాలో ఆటంకాలు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి పోవడంతో నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.



గతంలో ఉన్న బోరుబావులకు మోటార్లు బిగించి అవసరమైన సమయాల్లో నీరు వదలాలని మున్సిపల్ వాసులు కోరుతున్నారు. వేసవిలో ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు మోటార్ల ఏర్పాటుకు కృషి చేస్తామంటున్నారు.

'అమృత్ 2.0'లో ఆరు ట్యాంకులు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధితో ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా నిత్యం 1.8 ఎంఎల్‌డీ (18లక్షల లీటర్లు రోజుకి) సరఫరా చేస్తున్నారు. సుమారు 35వేల పైచిలుకు జనాభా ఉండడంతో ఈ నీరు సరిపోవడం లేదు. నిత్యం 2లక్షల లీటర్ల మేర నీళ్ల అవసరం ఉండడంతో.. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ యోగేశ్ మిషన్ భగీరథ అధికారులకు అదనంగా నీళ్లు ఇవ్వాలని లేఖ రాశారు. మున్సిపాలిటీలో 4,594 నల్లా కనెక్షన్లు ఉండగా.. ఇంకా 150 ఇళ్లకు పైగా కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ఇందుకు కారణం సరిపడా నీరు రాకపోవడమేనని తెలుస్తోంది. పట్టణంలో మైనార్టీ కాలనీ, ఎస్ఎం కాలనీ, ఆదర్శ్ నగర్ తదితర కాలనీల్లో తాగునీటి కనెక్షన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలో ఆరు తాగునీటి ట్యాంకులు నిర్మిస్తున్నారు. ట్యాంకులు అందుబాటులోకి వస్తే.. కొంత మేర మున్సిపల్ వాసులకు నీటి కష్టాలు తప్పే అవకాశం ఉంది.



ఆదర్శ్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న తాగునీటి ట్యాంకు

నిధులున్నా.. పనులు సున్నా

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలో కొన్ని కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. మున్సిపల్ పరిధిలో దాదాపు 20 వేల జనాభా ఉండగా ప్రతిరోజు 25 లక్షల లీటర్ల నీరు అవసరపడుతుంది. మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రతిరోజూ 20 లక్షల లీటర్ల నీరు మాత్రమే సరఫరా అవుతుంది. మిగతా నీటిని మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బోర్లద్వారా ప్రజలకు అందిస్తున్నారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీ వాసులు మిషన్ భగీరథ నీరు సరఫరాకు ఏళ్ల నుంచి విన్నవిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో నల్లా కనెక్షన్ లేక సొంత బోర్ల నీటినే వాడుకుంటున్నారు. పట్టణంలో నూతన పైప్‌లైన్ నిర్మాణం, తాగునీటి కల్పనకు కేంద్ర ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి అన్ని కాలనీలకు నీరు అందించాలని కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీరు అందించాలి



ఆమనగల్లు పట్టణంలోని విద్యానగర్ కాలనీకి మిషన్ భగీరథ నీరు అందించాలి. మిషన్‌భగీరథ నీరు అందించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఏళ్ల నుంచి కోరుతున్నాం. ఇంతవరకు అందించలేదు. కాలనీలో ఉన్న బోర్లద్వారానే నీటిని వాడుకుంటున్నాం.

– పాషా, విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు

'ముసురు'తున్న వ్యాధుల ముప్పు!

- చాపకింది నీరులా విస్తరిస్తున్న డెంగీ, డయేరియా, వైరల్ జ్వరాలు
- ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల క్యూ
- స్వీయ జాగ్రత్తలే శ్రీరామ రక్ష : మహేశ్వరం మెడికల్ కళాశాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్



పొంచి ఉన్న డెంగీ ముప్పు

నాలుగు నెలల ఓపీ వివరాలు	
మాసం	ఓపీ
మార్చి	16,130
ఏప్రిల్	12,645
మే	22,716
జూన్	22,668

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'వర్షాల వెన్నంటే వ్యాధులు ముసురుకుంటున్నాయి. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా పలువురు దగ్గు, జ్వరం, ఒంటినొప్పులు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం వనస్థలిపురం, కొండాపూర్ సహా జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సాధారణ ఓపీల్లో కన్పించే రోగుల్లో 40 శాతం మంది(పెద్దలు, చిన్నారులు)జ్వరపీడితులే. ఇవి సాధారణంగా కన్పించే లక్షణాలే అయినా.. అప్రమత్తత అవసరం' అని మహేశ్వరం మెడికల్ కళాశాల అనుబంధ(వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి) ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ స్పష్టం చేశారు. ఏమాత్రం అలసత్వం వహించినా.. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరక తప్పదని హెచ్చరించారు. బుధవారం ఆయన సీజనల్ వ్యాధులపై 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. రక్త, మూత్ర, ఇతర వైద్య పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు అవసరమైన మందులను అందజేస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి, ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్వాలిఫైడ్ వైద్యుడితో చికిత్సలు చేయించుకోవడం ఉత్తమం' అని చెప్పారు.

వైరస్ వ్యాప్తికి అనుకూలం

వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న చిరుజల్లుల కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోయి, గాల్లో తేమశాతం పెరగడంతో వైరస్ వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. శరీరం ఈ మార్పులకు అలవాటు పడేందుకు కొంతసమయం పడుతుంది. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. ఫ్లూ కారక వైరస్‌లు సులభంగా వ్యాపిస్తుంటాయి. దగ్గు, జలుబు, జ్వరం ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. ఇంట్లో ఒకరి తర్వాత మరొకరు అస్వస్థతకు గురవుతుంటారు. ఈ లక్షణాలతో కన్పించే పిల్లలను బడికి పంపకపోవడం ఉత్తమం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం వంటి స్వీయ జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు దరి చేరకుండా చూసుకోవచ్చు.

చిరుజల్లులకు ఇంట్లోని పూల కుండీలు, ఇంటిపై ఖాళీ డబ్బాలు, మూతల్లేని ట్యాంకుల్లో వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో డెంగీ కారక దోమలు పగటిపూట పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తుంటాయి. విపరీతమైన జ్వరం, ఒంటి నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరుతుంటారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న బాధితుల్లో ప్లేట్‌లెట్స్ సంఖ్య క్రమంగా పడిపోతోంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య భారీగా పడిపోవడం చికిత్సలో జాప్యం కారణంగా ఒక్కోసారి ప్రాణాల మీదికొస్తుంది. మస్కిటో కాయిల్స్, మస్కిటో మ్యాట్, కిటికీలకు జాలీలను ఏర్పాటు చేసుకోవడం, కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు ధరించడం, దోమ తెరలను వాడటం వంటి స్వీయ జాగ్రత్తలతో డెంగీని దరిచేరనీయకుండా చూసుకోవచ్చు.

బయటి ఆహారం వద్దు

ప్రస్తుతం చెరువుల్లోకి వచ్చే నీటివరదతో పాటే బ్యాక్టీరియా చేరుతోంది. సరిగా శుద్ధి చేయని ఈ నీటిని తీసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. కలుషిత నీటిని తాగడంతో వాంతులు, విరేచనాల బారిన పడుతుంటారు. వీధుల్లోని చిరుతిళ్లు, పానీపూరి ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. సాధ్యమైనంత వరకు బయటి ఆహారాన్ని తీసుకొవద్దు. తాజాగా వండిన ఆహారాన్ని తీసుకోవడమే ఉత్తమం. కాచి చల్లార్చిన నీటిని సేవించడం, సి విటమిన్ లభించే పండ్లను తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు.

ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యసేవలు

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని మహేశ్వరం మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిగా కేటాయించారు. ఇక్కడ 11 విభాగాల్లో 17 మంది ప్రొఫెసర్లు, 38 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రోగుల నిష్పత్తి మేరకు స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్లను నియమించారు. గతంలో ఔట్ పేషెంట్ విభాగంలో రోజుకు సగటున 250–300 మంది వస్తే.. ప్రస్తుతం 800 మందికిపైగా వస్తున్నారు. 220 పడకలు, మూడు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. ఐసీయూ విభాగాలున్నాయి. ఎంత మంది వచ్చినా మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యసేవలు పొందొచ్చు. వైద్య సేవల్లో ఏ చిన్న సమస్య ఎదురైనా స్వయంగా వచ్చి సూపరింటెండెంట్‌ను కలువచ్చు.

తెల్లచందనం స్మగ్లర్ల అరెస్ట్

- అక్రమంగా తరలిస్తున్న వెయ్యి కిలోల శ్రీగంధం చెక్కలు స్వాధీనం
- ఐదుగురిపై కేసు నమోదు, పరారీలో ఇద్దరు
- పట్టుబడిన సరుకు విలువ రూ.35 లక్షలు
- వివరాలు వెల్లడించిన చేవెళ్ల ఏసీపీ కిషన్



వివరాలు వెల్లడిస్తున్న చేవెళ్ల ఏసీపీ కిషన్ తదితరులు

చేవెళ్ల: పుష్ప సినిమా తరహాలో.. అక్రమంగా తరలిస్తున్న టన్ను (1,000 కిలోల) తెల్లచందనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ వెల్లడించారు. మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు చేవెళ్ల పోలీసులతో కలిసి మంగళవారం మండలంలోని బస్తేపూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎంహెచ్ 25 ఏజే 3689 నంబరు కలిగిన డీసీఎం వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్ బాడీ మొత్తం ఖాళీగా ఉండగా.. డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను ఎక్కడి నుంచి వస్తున్నారని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు డ్రైవర్ వెనక భాగంలో ప్రత్యేకంగా ఓ చిన్నపాటి అరను తయారు చేయించినట్లు గమనించారు. దీన్ని తెరిపించి చూడగా ప్లాస్టిక్ బ్యాగులలో చిన్నచిన్న ముక్కలుగా ఉన్న తెల్లచందనం (శ్రీగంధం) చెక్కలను గుర్తించారు. ఫారెస్ట్ అధికారులను పిలిపించి నిర్ధారించుకున్న అనంతరం ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వెయ్యి కిలోల బరువున్న గంధం చెక్కల విలువ రూ.35 లక్షలు ఉంటుందని ఏసీపీ తెలిపారు. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా జాత్ తహసీల్ ఉంట్వాడీ గ్రామం నుంచి చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలం నాగరగూడలోని ఆంధ్ర పర్ఫ్యూమ్ ఫ్యాక్టరీకి వీటిని తరలిస్తున్నారు. పట్టుబడిన ముగ్గురిలో తెల్లచందనం సాగు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన విజయ్ హన్మంత్ మానే, డీసీఎం డ్రైవర్ అబ్దుల్ అజీజ్, ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ సోహెబ్ ఉన్నారు. అనుమతులు లేకుండా తెల్లచందనం కొనుగోలు చేసి, తీసుకువస్తున్న ఫ్యాక్టరీ యజమాని అబ్దుల్లా కున్హి, కంపెనీ మేనేజర్ సాదిక్‌పై కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నారు. సదరు ఐదుగురు వ్యక్తులపై అటవీ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు గతంలో ఒకే పర్ఫ్యూమ్ కంపెనీలో పనిచేశారని పోలీసులు వెల్లడించారు. కొనుగోలు చేసిన తెల్లచందనాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకున్నారని తెలిపారు. డీసీఎంతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్, మాదాపూర్ ఎస్ఓటీ సీఐ సంజయ్‌కుమార్, ఫారెస్ట్ అధికారి రవికుమార్, ఎస్ఐలు వనం శిరీష, ఎస్ఓటీ ఎస్ఐలు సతీష్, బారాజ్ ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



కంది విత్తనాల బ్యాగు అందజేస్తున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తన సంచులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు నాలుగు కిలోల కంది విత్తన సంచులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతును రాజు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. రైతులు నిత్యం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తూ.. ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి చైతన్య మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండలానికి ప్రస్తుతం 16 క్వింటాళ్ల కందులు వచ్చాయని, నాలుగు క్లస్టర్స్‌కి నాలుగు క్వింటాళ్ల చొప్పున అందిస్తామన్నారు రైతులు సంబంధిత పత్రాలు అందజేసి, అక్కడే కందులను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గిరిరాజు, నాయకులు ప్రవీణ్, రాంరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, పాండురంగారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకే కాంగ్రెస్ పోరాటం



చేవెళ్ల: మాట్లాడుతున్న బొంతు రామ్మోహన్, చిత్రంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పర్ణికారెడ్డి

- బహిరంగ సభను విజయవంతం చేయాలి
- చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొంతు రామ్మోహన్, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

చేవెళ్ల: రాజ్యాంగ పరిరక్షణకే కాంగ్రెస్ పోరాడుతోందని.. ఈ నెల 4వ తేదీన ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న జైబాపు, జై భీం, జై సంవిధాన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొంతు రామ్మోహన్, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శుక్రవారం నిర్వహించనున్న ఈ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని.. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై వివరిస్తారని చెప్పారు.

గ్రామ స్థాయి నాయకులతో సమ్మేళనం



తుక్కుగూడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

తుక్కుగూడ: నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 4న నిర్వహించనున్న కాంగ్రెస్ గ్రామస్థాయి నాయకుల సమ్మేళనం విజయవంతం చేయాలని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. రేపు నిర్వహించనున్న సమ్మేళనానికి ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గ్రామస్థాయి నాయకులకు పార్టీబలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్నారని వివరించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు



నాగిరెడ్డిగూడ వద్ద రోడ్డు కింద పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

మొయినాబాద్: డ్రైవర్ నిర్లక్ష్యంతో స్కూల్ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన నాగిరెడ్డిగూడలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్ బస్సు బాకారం నుంచి పిల్లలను ఎక్కించుకుని నాగిరెడ్డిగూడ వెళ్తుండగా గ్రామ సమీపంలో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఒకవైపు చక్రాలు పంటపొలంలోకి దూసుకెళ్లడంతో బస్సు ఆగిపోయింది. ఈ సమయంలో బస్సులో సుమారు 15 మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతోనే రోడ్డు కిందికి దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు మండిపడ్డారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. స్కూల్ బస్సులు వరుస ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో వీటి ఫిట్‌నెస్‌పై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెద్దచెరువులో మట్టి తవ్వకాలు!



పెద్ద చెరువు (ఐల్యాండ్)లో మట్టిని తవ్వుతున్న అక్రమార్కులు

మీర్‌పేట: పెద్దచెరువు (ఐల్యాండ్)లో నిబంధనలకు విరుద్ధంగా బుధవారం ఉదయం మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులను వివరణ కోరగా.. మాకేం సంబంధం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చెరువు కట్టపై మొక్కలు నాటేందుకు.. కొద్దిగా మట్టి తీసుకెళ్తున్నామని అక్కడే ఉన్న కాంట్రాక్టర్ తెలిపారు. వాస్తవానికి బయటనుంచి మట్టి తీసుకు రావాల్సి ఉన్నా.. చెరువు స్థలంలో తవ్వకాలు చేపట్టడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇలా తవ్విన గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చెరువు స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి జేసీబీ, ట్రాక్టర్లతో లోనికి వెళ్లారని ఆరోపించారు.

కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మున్సిపల్ వర్కర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రునాయక్

కొత్తూరు: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.25 వేలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ విభాగం జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పలువురు కార్మికులతో కలిసి కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. అంతేకాకుండా కార్మికులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాకుండా, ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకే పనులు చేయించాలన్నారు. కార్మికులకు సబ్బులు, నూనె, చీపుర్లు, గ్లౌస్‌లు, మాస్కులు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా వారంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సంజీవకుమార్, జంగయ్య, రోజ, దేవమ్మ, అంజమ్మ, మంజుల, సుజాత, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీగా వేణుగోపాల్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: 15వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా వెదిరే వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వరాల జల్లు కురిసేనా!

- నేడు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి సీఎం రాక
- ముఖ్యమంత్రిగా తొలిసారిగా వస్తుండడంతో హామీలపై మండల వాసుల ఆశలు

మహేశ్వరం: మండల పరిధిలో ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవానికి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేయనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా వస్తున్న ఆయన ఇక్కడి అభివృద్ధికి ఏం వరాలు ప్రకటిస్తారనేది ఆసక్తి రేపుతోంది. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మండలం అభివృద్ధికి నోచుకోలేదు. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాలలకు సొంత భవనాలు లేవు. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి స్థలం, నిధుల మంజూరు, మండలం చుట్టూ పరిశ్రమలు, కంపెనీలు ఉండడంతో ఈ ప్రాంతంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు, పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి స్థలం ఇప్పించాలని కోరుతున్నారు. మహేశ్వరం మండల కేంద్రం నుంచి బెంగుళూరు జాతీయ రహదారి స్టేషన్ తిమ్మాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, కోళ్లపడకల్–పెద్ద గోల్కొండ ఓఆర్‌ఆర్ వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం, మహేశ్వరం గేటు –మహేశ్వరం మండల కేంద్రం వరకు ఆరు వరుసల రోడ్డు నిర్మాణం, శివగంగ రాజరాజేశ్వర ఆలయం, ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆశిస్తున్నారు. 100 పడకల ఆస్పత్రి, కుల సంఘాల స్థలాలకు పట్టా సర్టిఫికెట్ల మంజూరుతో పాటు తహసీల్దార్ భవనానికి నిధులు మంజూరు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలం, అధునిక హంగులతో భవన నిర్మాణానికి నిధులు మంజూరుతో పాటు పలు అభివృద్ధికి పనులకు వరాల జల్లు కురిపిస్తారని గంపెడాశతో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ ముఖ్యమంత్రికి నియోజకవర్గ అభివృద్ధికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

కాడెద్దుల అపహరణ

నందిగామ: రోజంతా అరక కొట్టి రాత్రివేళ చెట్టుకింద కట్టేసిన కాడెద్దులు అపహరణకు గురైన సంఘటన నందిగామలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్ కథనం ప్రకారం.. స్థానికంగా ఉండే శివగళ్ల జంగయ్యకు గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన వ్యవసాయ భూమి ఉంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలంలో తన ఎద్దులతో అరక తోలాడు. రాత్రి ఎప్పటిలాగే పొలం వద్ద ఓ చెట్టుకు ఎద్దులను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి అవి కనపడలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, పరిసర గ్రామాలలో ఎంత వెతికినా జాడ కనపడలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. ఎద్దుల విలువ సుమారు రూ.లక్ష యాభై వేలు ఉంటుందని వాపోయాడు.

సెట్టింగ్‌తో సెటిల్‌మెంట్!

సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం

- పీఎస్‌లే కేంద్రంగా పంచాయితీలు
- ఫలితాలివ్వని ఎస్‌ఓపీలు, మానిటరింగ్ కమిటీలు
- హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో మరోసారి తెరపైకి

‘పోలీసుస్టేషన్లు సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మారాయి. వీటిని సివిల్ పంచాయితీలకు కేంద్రాలుగా మార్చారు. సివిల్ వివాదాల్లో తలదూర్చొద్దని చెప్పినా బెదిరింపులకు దిగుతూ ఏదో ఒక క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నారు’

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నాగోలు పోలీసుస్టేషన్‌లో నమోదైన ఓ కేసు విచారణ సందర్భంగా మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తడకమల్ల వినోద్ కుమార్ చేసిన వ్యాఖ్యలివి.



సాక్షి, సిటీబ్యూరో: సివిల్ వివాదం.. ఇదంటే పోలీసులకు వీనుల విందు, బహు పసందు కూడా. క్రిమినల్ కేసులో ఏముంటుంది... పరిశోధన, తిరగడం, చాకిరీ... అదే సివిల్ కేసుల్లో అయితే... డబ్బే డబ్బు. నగరంతో పాటు చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలు రావడంతో అదే స్థాయిలో అక్రమాలు పెరిగిపోయాయి. ఇలాంటి వివాదాలన్నీ చివరకు పోలీసుల వద్దకే చేరుతున్నాయి. దీంతో కొందరు పోలీసులు తమ సివిల్ సెటిల్‌మెంట్లకు పోలీసుస్టేషన్లనే అడ్డాలుగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి గతంలో న్యాయస్థానాలు, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి.

ఆ విషయాల్లో తెలివిగా వ్యవహరిస్తూ...

ఇప్పుడు అనేక పోలీసుస్టేషన్లలో భూ వివాదాలను పరిష్కరించడం మామూలు విషయంగా మారిపోయింది. ఒక విధంగా చెప్పాలంటే సివిల్ వివాదాలు లేకపోతే స్టేషన్‌తో పాటు అధికారుల ఖర్చులు కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది. తమ జేబులు నింపేవి కూడా అవే కావడంతో కింది స్థాయి పోలీసులు వాటి కోసం వెంపర్లాడుతున్నారు. అయితే బయట పడితే ఇబ్బందులు తలెత్తుతాయనే కారణంతో సాధ్యమైనంత వరకు కేసు రిజిస్టర్ చేయకుండానే వ్యవహారం చక్కబెడుతుంటారు. అప్పటికీ సెటిల్ కాకపోతే తాము ఇబ్బందుల్లో పడకుండా ఉండేందుకు ఇరు వైపుల నుంచి ఫిర్యాదు తీసుకుని ఆ తర్వాత కథ నడిపిస్తున్నారు. కేసు నమోదయితేనే సివిల్ కేసుల్లో తలదూర్చుతున్నారని తెలుస్తోంది. అసలు కేసే నమోదు చేయకపోతే? పోలీసులకు ఇబ్బందే ఉండదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం కేసు నమోదు తప్పనిసరిగా మారుతుంది. అలాంటప్పుడు తమకు అనుకూలమైన లాయర్ల వద్దకు క్లయింట్స్‌ను పంపే పోలీసులు కోర్టు రిఫర్ ద్వారా రమ్మని చెప్పి కేసులు నమోదు చేస్తుంటారు.

వాటి విభజన చాలా కష్టం...

‘ఇచ్చట సివిల్ కేసులు నమోదు చేసుకోం... వివాదాలు పరిష్కరింపబడవు’ దాదాపు ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ ఈ బోర్డులు మనకు కనిపిస్తుంటాయి. అయితే సివిల్ కేసులు నమోదు చేసుకోవడం మానేసిన ఖాకీలు... వచ్చిన కేసునల్లా సెటిల్‌మెంట్ చేయడం మాత్రం మర్చిపోవట్లేదు. దీనికి కారణం భూ వివాదాల్లో సివిల్, క్రిమినల్ విభజించడం చాలా కష్టం. ఈ రెండింటి మధ్యా ఓ చిన్న గీత మాత్రమే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఓ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే... అది సివిల్ వివాదం అవుతుంది. దీనిపై న్యాయస్థానంలోనే తేల్చుకోవాలి. అదే వ్యక్తి స్థలాన్ని ఆక్రమించే క్రమంలో కూల్చివేతలు, బెదిరింపులకు, దాడులకు దిగితే అది క్రిమినల్ కేసుగా మారుతుంది. అంటే... పోలీసుల చేతికి వచ్చినట్లే. ఈ పరిణామాల నేపథ్యంలో స్పష్టమైన మార్గదర్శకాలు, కఠిన చర్యలు లేకుండా పోలీసులను, సివిల్ కేసులను వేరు చేయడం సాధ్యంకాదని వినిపిస్తోంది.

అవన్నీ అటకెక్కిపోయాయి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2009లో ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసుల సివిల్ వ్యవహారాల పర్యవేక్షణకు మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ 2010 నవంబర్ 6న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా ఆరోపణ, ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అప్పట్లో రాచకొండ లేకపోవడంతో హైదరాబాద్ కమిషనరేట్ పోలీసు కమిషనర్ అధ్యక్షుడిగా, ఐజీ స్థాయి అధికారులైన అదనపు కమిషనర్ (సమన్వయం), అదనపు కమిషనర్ (నేరాలు) సభ్యులుగా, సైబరాబాద్ కమిషరేట్ విషయానికి వస్తే అధ్యక్షుడిగా పోలీసు కమిషనరే ఉన్నప్పటికీ సభ్యులుగా పరిపాలన విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు, క్రైమ్ డీసీపీ వీటిని ఏర్పాటు చేశారు. ఆపై ఉన్నతాధికారులు అనేక సందర్భాల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లకు (ఎస్‌ఓపీ) రూపమిచ్చి వెబ్‌సైట్లలో పొందుపరిచారు. కాలక్రమంలో ఇవన్నీ అటకెక్కిపోవడంతో ఠాణాల్లో సెటిల్‌మెంట్లు కొనసాగుతున్నాయి.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీంద్రాచారి

హయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వ కర్షక, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ సర్కారు తీరుకు నిరసనగా ఈ నెల 9న తలపెట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఫిక్స్‌డ్ టర్మ్, అప్రెంటీస్, థర్డ్ పార్టీ ట్రైనీలుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు హరిసింగ్‌నాయక్, నాయకులు లక్ష్మణ్, నర్సింహ, ప్రసాద్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగు లేదు



బీమా బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

- సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్
- తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత

అనంతగిరి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో ప్రవేశపెట్టిందని, సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లోని ఓంసాయి ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తవుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి ఈ సిమెంట్ సరైన ఎంపిక అని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని, స్లాబ్, కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడుతారని స్పష్టంచేశారు. మార్కెట్లో దొరికే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ ధర బ్యాగుకు 20 రూపాయలు అధికంగా ఉంటుందన్నారు. అనంతరం 60 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరాంజనేయరెడ్డి, డీలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం



పోస్టాఫీస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పోస్టాఫీస్‌లో తనిఖీ చేసిన అధికారులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పద్మావతీకాలనీలో ఉన్న పోస్టాఫీస్‌లో నిధుల దుర్వినియోగంపై బుధవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. పోస్టల్ శాఖకు సంబంధించిన రూ.19 లక్షల నిధులు ఖాతాలో జమ చేయకుండా స్థానిక పోస్టల్ ఉద్యోగి దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై అధికారులు కదిలారు. వనపర్తి పోస్టల్ ఆఫీస్ సూపరింటెండెంట్ భూమన్న, అధికారులు సైదానాయక్, గోపీనాథ్, సుజన్ నాయక్, రవికుమార్‌లు షాద్‌నగర్‌కు విచ్చేసి కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో పోస్టల్‌శాఖకు సంబంధించిన రూ.19లక్షల డబ్బులు లేకపోవడంతో స్థానిక అధికారి ఉమామహేశ్వర్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఎక్కడ ఉన్నాయని స్థానిక అధికారిని ప్రశ్నించడంతో డబ్బులు ఇంటి వద్ద ఉన్నాయని చెప్పారు. దీంతో రెండు రోజుల్లో డబ్బులు మొత్తం ఖాతాలో జమ చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మాడ్గుల: మండల పరిధిలోని రాజీవ్ నగర్ తండా శివారులోని వాగు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన ప్రకారం.. బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు రెండు ట్రాక్టర్లు అడ్డుకున్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు, వాహన యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

యాచారం: గ్రామాల్లో సీసీ కెమెరాలుంటే 24 గంటల పాటు పోలీస్ బందోబస్తు ఉన్నట్లేనని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని నస్దికసింగారంలో దాతల సహకారంతో వివిధ చోట్ల బిగించిన పది సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలుంటే ఎంతో రక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లోని యువత, రాజకీయ వేత్తలు, ఉద్యోగులు సమష్టిగా కలిసి సీసీ కెమెరాల బిగింపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ మధు, గ్రామస్తులు పాండురంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, గాలయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అభ్యుదయ్ డే



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విద్యార్థులతో నిర్వాహకులు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటీ) ఆధ్వర్యంలో జరిగిన మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ అభ్యుదయ్ డే బుధవారం ముగిసింది. గత 18న ప్రారంభించిన ఈ కార్యక్రమం పలు ఉపయుక్తమైన వర్క్‌షాప్స్, ఇంటరాక్టివ్ సెషన్స్, ప్రజెంటేషన్స్‌తో విద్యార్థులను ఆకట్టుకుంది. టీసీఎస్ సంస్థ హెడ్ చల్లా నాగ్, ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వనితా దట్ల, స్మార్ట్ ఫార్మా 360 సీఈఓ సహ వ్యవస్థాపకురాలు సాకేత, న్యాయవాది మోబాషీర్ సర్వర్, కెనడాలోని డల్హౌసీ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ స్టీఫెన్ మెచాలస్ తదితర దేశ విదేశీ ప్రముఖులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్



మెహబ్బత్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్ మోహన్

మహేశ్వరం: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మండల పరిధిలోని మెహబ్బత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను, ప్రాథమిక పాఠశాల, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా తగు చొరవ చూపాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మైథిలి ఉన్నారు.

20 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీ

రాజేంద్రనగర్: అత్తగారింట్లో కుమారుడి పుట్టిన రోజు జరుపుకొని వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి 20 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదును ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన నవీన్ ప్రైవేటు ఉద్యోగి. తన కుమారుడి పుట్టిన రోజు నేపథ్యంలో మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి లింగంపల్లిలోని తన అత్తగారింటికి వెళ్లాడు. అక్కడే పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని రాత్రి హైదర్‌గూడలోని ఇంటికి వచ్చేందుకు సిద్ధమవ్వగా వర్షం పడటంతో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా అల్మారాలో దాచిన 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు కనిపించలేదు. వెంటనే వారు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

గంజాయి పట్టివేత

కేపీహెచ్‌బీకాలనీ: మహారాష్ట్ర నుంచి ఇద్దరు యువకులు గంజాయి తీసుకువచ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూసాపేటకు చెందిన జీవన్, బోరబండకు చెందిన చిన్న స్వామి స్నేహితులు. గంజాయికి అలవాటు పడిన వారు ధూల్‌పేటలో కొనుగోలు చేసి సేవించేవారు. గత నెల మహారాష్ట్రలోని పర్లి ప్రాంతానికి వెళ్లిన వారు పర్లీ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి 450 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. బుధవారం రైలులో హైదరాబాద్ చేరుకున్న వారు బోరబండకు వెళ్లేందుకు హైదర్‌నగర్ బస్టాప్ వద్ద వేచి ఉండగా సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీలత సిబ్బందితో వారిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.